
# బాధ్యత



— మాడుగుల కృష్ణకుమారి

అరోజు వుదయం జానకమ్మ లేచేసరికి యిల్లంతా కిష్కిందలా వుంది.

పాలపేకెట్లు పెట్టిన చోట్నుంచి కదలలేదు.

కుళాయి కారిపోతూన్నా పట్టించుకునే నాధుడే లేడు.

వంటగది తలుపులు తెరిచే ప్రయత్నమే ఎవరు చెయ్యలేదు. అత్తగారు లేస్తుందని పెద్ద కోడలు అనుకుంటే, పెద్ద కోడలు లేస్తుందని చిన్నకోడలు అనుకుంది.

ఎనిమిది గంటలు దాటుతూన్నా ఆ యింట్లో కాఫీ ప్రయత్నాలు ఏం కన్పడలేదు.

రాత్రంతా అనారోగ్యంతో తెల్లవారినా రోజులా లేవలేకపోయింది జానకమ్మ.

ముఖం కడుక్కు వచ్చిన జానకమ్మకు భర్త రాఘవయ్య కాఫీగ్లాసు అందించాడు.

"అయ్యో ! ఇదేమిటండి మీరు నాకు కాఫీ యివ్వటం" నొచ్చుకుందావిడ.

"ఇంట్లోవారందరు త్రాగారా?" అంది.

"అందరి సంగతి నీకెందుకు కానీ ముందు నువ్వు కాఫీ త్రాగి టాబ్లెట్ వేసుకుని కళ్ళు మూసుకు పడుకో" అన్నారాయన మంచం మీద నుంచి లేవబోతున్న భార్యను చెయ్యిపట్టి వారిస్తూ.

"ఇంతకీ కాఫీ మీరు చేశారా?

"లేదు హోటల్నించి తెచ్చాను" అన్నారాయన.

"ఇంట్లో యిందరుండి మీరు కాఫీ హోటల్నించి తేవటమా. బాగుంది" అందావిడ.

"నాన్నగారూ, అమ్మ లేవలేదా?" అన్నాడు బయట్నించి పెద్ద కొడుకు.

"అబ్బే లేదురా" అన్నారాయన.

అదేంమాట అన్నట్లుగా చూసిందావిడ భర్తవైపు.

అదంతే అన్నట్లుగా చూశారాయన. క్రితంరోజు రాత్రి అందరికీ భోజనాలు పెడుతున్న జానకమ్మ ఒక్కసారిగా వున్నట్లుండి పడిపోయింది.

డాక్టరు దగ్గరకు తీసుకెడితే హైబి.పి వుందని మందులిచ్చి రెస్టు అవసరం అని చెప్పాడు.

ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు యంత్రంలా పని చేసుకుపోయే జానకమ్మ ఒక్కరోజు లేవలేకపోయేసరికి ఆ ఇంటి స్వరూపమే మారిపోయింది.

పెద్ద కోడలు ఏ సరుకులు ఎక్కడున్నాయో, వేటిలో ఎంతవేయాలో తెలియక బామ్మగారు-గారె ముక్కలు రీతిలో చీటికి మాటికి అత్తగార్ని అడుగుతూ ఎలాగో వంట పూర్తి చేసింది.

మగవాళ్ళకి పిల్లలకి క్యారెయర్లు కట్టిచ్చారు.

తను చేసిన వంట తనకే నచ్చలేదు పెద్దకోడలికి ముద్దనోట పెట్టుకోపోతూన్న జానకమ్మ గారి కయితే భళ్ళున వాంతి వచ్చినంత పనయింది.

ముద్ద లాటి అన్నం, రూపు, రంగు తెలియని పదార్థాలు ఆ పూట ఇంటో వాళ్ళందరిని యిబ్బంది పెట్టాయి.

ఆ ఒక్క పూటకే ఎవరికి వాళ్ళకే జిహ్వా చచ్చి నట్లనిపించింది.

"ఎలా వుంది నా కోడలి చేతి వంట?" అన్నారు రాఘవయ్య గారు.

"పాపం! తనసని ఏం లాభం అండీ. ఎప్పుడన్నా చేస్తే తెలుస్తుంది. అయినా నేనుండగా వాళ్ళకావసరం ఎందుకు చెప్పండి" అంది.

"చూడు జానకి! పిల్లల తల్లులయినా నా కోడళ్ళకి వంట చెయ్యడం రాదని నల్గురికి తెలిస్తే, నవ్వి పోగలరు జాగ్రత్త. అయినా వాళ్ళనని ఏం ప్రయోజనంలే, అసలు తప్పంతా నీది" అన్నారాయన.

"ఇందులో పరాయివాళ్ళెవరండి అందరు నా పిల్లలు కారూ. నేనేమన్నా పరాయి వాళ్ళకి చేస్తున్నానా చెప్పండి" అంది ఎదురు ప్రశ్నవేస్తూ.

"సరి సరి! నీతో వాదించడం నావల్ల కాదు కానీ, డాక్టరు గారు నీకు పూర్తి రెస్టు అవసరం అని చెప్పారు. ఏం చేస్తావో మరి" అన్నారాయన.

"ఏదో కాస్త కళ్ళుతిరిగినంత మాత్రానా రెస్టు అంటే ఎలా కుదురుతుంది చెప్పండి. చూశారుగా మధ్యాహ్నం భోజనం తీరు. నాకేం ఫర్వాలేదు మీరనవసరంగా, గాబరా పడకండి" అందావిడ.

ఉదయం అయిదు గంటలకు లేచి స్నానం, పూజ చేసింది మొదలు మంచినీళ్ళు పట్టుకోవడం, కాఫీ చేసి రెండు ఫ్లాస్కుల నిండా పోసి, పిల్లలందరికీ గ్లాసులలో పాలు కూడా కలిపి, పెద్ద గిన్నెనిండా అన్నం వార్చి, పప్పు, కూరలు, పచ్చళ్ళు చెయ్యడం జానకమ్మ దినచర్య.

నా ఇల్లు, నా పని అన్నభావనే తప్ప, కోడళ్ళు వచ్చాక కూడా నేను ఎందుకు చెయ్యాలి. నేను సుఖ పడేదెప్పుడు అని అనుకునే మనస్థత్వం కాదు ఆ ఇల్లాలిది.

తన దిన చర్య క్రమం తప్పకుండా సాగిపోవటమే ఆవిడకు ఎనలేని సంతృప్తి.

అందుకే భర్త వారిస్తున్నా వినకుండా సాయంకాలం వంట తనే చేసింది.

ఆరాత్రి విందు భోజనంలాంటి జానకమ్మగారి చేతి వంటను అందరూ కడుపునిండుగా తిన్నారు.

రోగం వద్ద మనిషికి పెట్టే పత్యం వంటని భార్య చేతి వంటను వెక్కిరించాడు పెద్దకొడుకు.

"ఒరేయి పెద్దాడా! నీకు అమ్మచేతి వంట శాశ్వతం కాదు. నీ పెళ్లాం చేతి వంట శాశ్వతం అని గుర్తుంచుకో" అన్నారు రాఘవయ్యగారు.

"నాన్నా! అమ్మ వండినంత కాలం వండనియ్యండి తర్వాత ఎలాగు తిప్పలు తప్పవు కదా" అన్నాడు చిన్న కొడుకు.

"అంతేకానీ, మా భార్యల్ని కూడా అమ్మ దగ్గర నేర్చుకోమంటాం" అని ఒక్క మాట కూడా అనరు కదా ఈ కొడుకులు అనుకున్నారాయన.

రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికొచ్చిన కూతురు హేమ, నేరుగా మంచం మీద వాలిపోయింది.

"మమ్మీ! వుదయం నుంచి తల పగిలి పోతోందంటే నమ్ము. నువ్వు లేవకపోతే కాఫీ పెట్టిచ్చే వాళ్ళు కూడా లేరీ యింట్లో" అంది హేమ కోపంగా.

"ఏమ్మా! కాలేజీ చదువుకొచ్చావు ఆ మాత్రం కాఫీ పెట్టటం రాదా? యింకా ఎప్పుడు నేర్చుకుంటావు చెప్పు" అన్నారు రాఘవయ్యగారు కూతుర్ని మంద లింపుగా.

"చూడు మమ్మీ! నా కన్నా పెద్దవాళ్ళు యిద్దరు వదినలున్నారు యింట్లో. వాళ్ల నేం అనరు నాన్నగారు, నన్నే అంటారు. అయిదు గంటలకు ట్యూషన్‌కు వెళ్తానా? అట్నించి కాలేజీకి వెళ్తానా! తిరిగి కాలేజీ

Vemakoti Seeta Rama Sastry
WRITER APSEB JAO (Retd)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.




అవగానే కంప్యూటర్ క్లాసు, ఈవినింగ్ ట్రైపు, పార్ట్ హొండు. ఈ రోజు భోజనం కూడా చెయ్యలేదు. నాకు ఎలాగో వుంది." అంది హేమ తల్లి ఒడిలో పడుకుని గారంగా.

కూతురలా అనటం చూసి కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయావిడకు.

కంచంలో అన్నం కలిపి ముద్దలుగా చేసి తనకు తినిపిస్తుంటే అమృతంలా అన్పించింది హేమకు.

"మమ్మీ! ఈ రోజులా కాకుండా, రేపుదయం అయిదు గంటలకు లేస్తావు కదూ" అని తన బుజాల మీద చేతు లేసి గోముగా అడుగుతున్న కూతుర్ని ప్రేమగా దగ్గరకు తీసుకుని గుండెలకు అదుముకుందావిడ.

బాగా అలసిపోవటంతో అలాగే నిద్రలోకి వరిగి పోయింది హేమ.

* * *

"అయ్యిందా అమ్మాయి గారి పవళింపు సేవ" అన్నారు రాఘవయ్యగారు నవ్వుతూ.

"ఏమిటండీ మీ వేళాకోళం" అంది జానకమ్మ.

"వేళాకోళం కాదు జానకి. నా వేదనని అర్థం చేసుకో. ఒక్కరోజు నువ్వు లేవకపోయే సరికి ఇంటి ల్లిపాది ఎంత అవస్థపడ్డారో చూశావా. బాధ్యత, తన ఒక్క దానికే కాదుగా. వాళ్ళకి కూడా బాధ్యత లేదంటావా చెప్పు. నీ బాధ్యతను మిగిలిన వాళ్ళకి కూడా పంచు. నువ్వు యంత్రానివి కాదు, మనిషివని గుర్తుంచుకో. యంత్రమయినా, అరిగి అరిగి ఏదో ఓ రోజు ఆగిపోతూందే. మనిషయినా అంతే ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చెయ్యకు. నీకేదయినా అయితే..." గొంతు పూడుకు పోవటంలో మాట్లాడలేక భార్య గుండెలో ముఖం దాచుకున్నారాయన.

భర్త ఆప్యాయతకు కళ్ళు తడయ్యాయి ఆవిడకు. మృదువుగా భర్త తలనిమురుతూ-

"ఏమిటండీ ఈ పిచ్చి. నాకేమయిందిప్పుడు. నేను బాగానే వున్నానుగా. మీరనవసరంగా బాధ పడు తున్నారు. ఓపికున్నన్నాళ్ళయినా నా పిల్లలకు నా చేతులతో చేసి పెట్టనీయండి. అదే నాకు సంతృప్తి" అంది.

తనెంత చెప్పినా, భార్య తన వైఖరి మార్చుకోదని యధాప్రకారం చేస్తున్న జానకమ్మను చూస్తుంటే అన్పించిందాయనకు.

* * *

"ఆ సాయంకాలం రాఘవయ్యగారి నోటి వెంట ఆ మాట విన్న ఇంట్లో సభ్యులందరూ, నివ్వెర పోయారు.

జానకమ్మ గారయితే మరీను. రిటైర్ అవబోయే ముందు ఈ విపరీతం ఏమిటని ఆవిడ ఏకంగా ఏడుపే మొదలు పెట్టింది.

"డిగ్రీ రెండో సంవత్సరం తన చదువేంకాను" అనుకుంది హేమ. విషయం విన్నప్పట్నించి గుండెల్లో రాయి పడ్డట్లయింది కోడళ్ళిద్దరికి.

"మీ కయినా యిబ్బందే కదా నాన్నగారు! ఎవరి తోనన్నా మాట్లాడితే పని జరగవచ్చునేమో"- అన్నారు కొడుకులిద్దరు.

"లాభం లేదు" అన్న ఒక్క మాట మినహామారు పలకలేదాయన. ఈ వార్త విన్నప్పట్నించి మనసేం బాగుండలేదు జానకమ్మగార్కి.

"మరో రెండు సంవత్సరాల్లో మీరెలాగూ రిటైర్ అవబోతున్నారు. అర్థాంతంగా యిప్పుడి ట్రాన్స్‌ఫర్ ఏమిటండి? ఈ వయసులో తట్టాబుట్టా వేసుకుని మళ్ళీ అక్కడ వేరు కాపురమా. అయినా హేమ చదువు మాట" అందావిడ.

"హేమ మనతో రాదు. మనిద్దరమే వెళ్ళేది. దానికక్కడ మళ్ళీ కాలేజీలో సీటు దొరకటం అంటే కుదరని పని" అన్నారాయన.

జానకమ్మకి ఈ ట్రాన్స్‌ఫర్ పేరిట భర్తతో వెళ్ళడం సుతరాము యిష్టంలేదు. అలా అని రాను అనలేదు. వంటరిగా భర్త చెయ్యికాల్చుకోవటంఆయనవల్లకాదు. హొటలు తిండా పడదు. ఆ పరిస్థితిలో చేసేదేంలేక భర్తతో బయలుదేరింది.

కావలసిన సామాన్లన్నీ రాఘవయ్యగారు ప్యాక్ చేశారు.

వేరు కాపురానికి వెళ్ళే కొత్తగా పెళ్ళయిన వాళ్ళలా భర్తతో వెళ్ళడం సిగ్గుగాను, బాధగాను అన్పించిందా విడకు.

* * *

లంకంత సొంత యింట్లోంచి వచ్చి ఈ రెండు గదుల్లో యిమడటం మొదట యిబ్బంది అన్పించినా రాను రాను అదే అలవాటయ్యింది ఆవిడకు.

భార్య వాదిస్తున్నా వినకుండా వంట మినహా మిగిలిన పనులకు ఓ మనిషిని ఏర్పాటు చేశారు రాఘవయ్యగారు.

చిన్న గిన్నెలతో వంట చేస్తుంటే ఎలా వండాలో తెలియలేదావిడకు.

అనుక్షణం పిల్లలే గుర్తుకు రాసాగారు.

ఎలా వున్నారో ఏం తింటున్నారో అన్నదే ఆవిడ ధ్యాస.

వారం రోజుల్లో వుగాది పండుగరాబోతోంది. పిల్లల్ని చూసి అర్నెల్లు కావడంతో తప్పని సరిగా వెళ్ళాలి అని పట్టుపట్టింది జానకమ్మ.

భార్య మాటను కా[illegible]య్యగారు.

ఇంట్లో అడుగు పెట్టగానే ఆనందంతో అందర్నీ దగ్గరకు తీసుకుని పేరుపేరునా ఆప్యాయంగా పలక రించిందావిడ.

ఆ రాత్రి పొద్దుపోయే వరకు అందరూ ఆనందంగా కబుర్లు చెప్పుకున్నారు.

మర్నాడుదయం అలవాటుకి భిన్నంగా ఆరున్నరకి మెలకువ వచ్చింది జానకమ్మకు.

ఖంగారుగా లేచిన ఆవిడ కళ్ళు వంటింట్లో దృశ్యాన్ని నమ్మలేకపోయాయి.

"అప్పుడే లేచావెందుకమ్మా!" అంది హేమ కాఫీ కలుపుతూ.

ఓ వక్క పెద్ద కోడలు వేపపూత పచ్చడి తయారు చేస్తోంది.

మరో వక్క చిన్న కోడలు కూరలు తరుగుతోంది.

బయట పంపు దగ్గర కొడుకు లిద్దరూ ఒకరు నీళ్ళు పడుతుంటే, మరొకరు ఇంట్లోకి చేరవేస్తున్నారు.

అప్పుడే అందరూ తలంటు కున్నారు.

ముఖం కడుక్కు వచ్చిన తల్లికి కాఫీ గ్లాను అందిస్తూ "అమ్మా! నా కాఫీ ఎలా వుందో చెప్పాలి" అంది హేమ.

"అమ్మా! ఈ వుగాది పండక్కి నీకు బహుమతి ఏమిటో తెలుసునా నీ కోడళ్ళ చేతి వంట" అన్నారు కొడుకులిద్దరు.

"ఏం వద్దు. పెద్దదాన్నినేనుండగా పండగపూట మీరు చెయ్యటమేమిటి" అందావిడ.

"వద్దత్తయ్యా! చేసినంత కాలం చేశారు. ఇంక మీరు రెస్టుగా వుండండి. మీరలా మా కంటి ఎదురుగా కూర్చుని ఆర్డరు చెయ్యండి. మా కదే చాలు" అన్నారు కోరస్‌గా కోడళ్ళిద్దరు.

"అమ్మా! నువ్వెళ్ళిపోయాక ఈ ఇంటి పద్ధతి మారిపోయింది. అందరికన్నా ముందు లేచేది నేను కాబట్టి కాఫీ సెక్షన్ నాది. మిగిలిన పనంతా వదినలది. వదినలకు డైరెక్షన్ ఏమిటో తెలుసా యిదిగో యిది" అంది తన చేతిలోని మాలతీ చందూర్ వంటల పుస్తకం చూపిస్తూ.

ఆనందం + దుఃఖం పొంగుకు వచ్చిన ఆవిడ, భర్తతో చెపితే "చూశావా జానకీ! నువ్వు నీ బాధ్యత అనుకున్న రోజు అది వాళ్ళ పట్ల బద్ధకంగా మారింది. నువ్వు లేని మరుక్షణం ఎవరిబాధ్యత వాళ్ళు తెలుసుకున్నారు. పిల్లల పట్ల పిచ్చి ప్రేమతో వాళ్ళకి చేస్తున్నానని తృప్తి పడ్డావే కానీ, వాళ్ళని బాధ్యతల్నుంచి విస్మరింప చేస్తున్నావని గుర్తించలేక పోయావు. వయసు వచ్చిన పిల్లలకు బద్ధకం అన్నది శత్రువు అయితే, బాధ్యత అన్నది మిత్రువు అని నీకు తెలియ పర్చటానికే, కావాలని ఈ ట్రాన్స్‌ఫర్ చేయించుకుని నిన్ను యింటికి దూరం చేసి మన పిల్లలకు బాధ్యతఅప్పగించాను. ఇంక వాళ్ళు పొర పాటున కూడా ఆ బాధ్యతను తిరిగి నీకు అప్పగించరు. తెలుసునా" అన్న భర్త మాటలకు ఆనందంతో కన్నీళ్ళు వచ్చాయామెకు.

అమ్మ నాకేం నేర్పలేదు అని కూతురు, మా అత్తగారు మమ్మల్నిలా తయారు చేశారని కోడళ్ళు అనే నిందల నుండి కాపాడి, వాళ్ళ బాధ్యతల్ని వాళ్ళు గుర్తించేలా చేసిన భర్తను మనసులో పదేపదే పొగుడుతూ కళ్ళతోనే కృతజ్ఞతలు తెలియచేసింది జానకమ్మ.